ఫొటో గ్రాఫర్ రాజేశ్ సతీమణి లావణ్యకు చెక్కులను అందజేస్తున్న నమస్తే తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ చిరంజీవి, ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే దినపత్రిక ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ ఫొటోగ్రాఫర్ గంగాధర్, సీనియర్ ఫొటోగ్రాఫర్ రజినీకాంత్

## ఫొటో జర్నలిస్టు కుటుంబానికి అండగా..

- సుమారు రూ.10 లక్షలు అందజేసిన 'నమస్తే తెలంగాణ'
- ఫిబ్రవరిలో గుండెపోటుతో మరణించిన రాజేశ్

హైదరాబాద్, సిటీబ్యూరో, జూన్ 21 ( నమస్తే తెలంగాణ ): ఫొటో జర్నలిస్టు రాజేశ్ కుటుంబానికి నమస్తే తెలంగాణ దినపత్రిక అండగా నిలిచింది. సుదీర్ఘకాలంగా సంస్థలో పనిచేసిన రాజేశ్ ఫిబ్రవరిలో గుండెపోటుతో మరణించారు. ఆ కుటుంబానికి తోడ్పాటును అందించేందుకు నమస్తే తెలంగాణ ఉద్యోగులు, యాజమాన్యం కలిసి సుమారు రూ.10 లక్షలు పోగుచేశారు. ఇందుకు సంబంధించిన చెక్కులను శుక్రవారం హైదరాబాద్‌లోని పత్రిక ప్రధాన కార్యాలయంలో నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే దినపత్రిక ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ వైస్ ప్రెసిడెంట్ చిరంజీవి, చీఫ్ ఫొటోగ్రాఫర్ గంగాధర్, సీనియర్ ఫొటోగ్రాఫర్ రజినీకాంత్ కలిసి రాజేశ్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ సతీమణి లావణ్య మాట్లాడుతూ.. పెద్ద దిక్కును కోల్పోయి కష్టాల్లో ఉన్న తమకు నమస్తే తెలంగాణ అండగా నిలవడం ధైర్యాన్నిచ్చిందని తెలిపారు. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న సంస్థకు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. రాజేశ్ కుమార్తె శివాని 9వ తరగతి, చదువుతుండగా, బాబు వర్షిత్ 7వ తరగతి చదువుతున్నారు. కాగా, తెలంగాణ ఉద్యమకాలంలో అమరుడు సిరిపురం యాదయ్య ఆత్మ బలిదానం చేస్తుండగా రాజేశ్ తీసిన ఫొటో ఎందరినో కదిలించింది.

## హైకోర్టులో యోగా డే

హైకోర్టు ఆవరణలో శుక్రవారం యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగాసనాలు చేశారు.

# ఇసుక దోపిడీ రోజుకు 30 లక్షలు

- అక్రమ వసూళ్లతో అదనపు బకెట్ దందా
- క్వారీల వద్ద కాంట్రాక్టర్ల బలవంతపు వసూళ్లు
- అధికార పార్టీ కీలక నేతల అండదండలు
- జిల్లా అధికారుల పాత్రపై ఆరోపణలు
- లోక్‌సభ ఎన్నికల తర్వాత పెరిగిన దందా

కాళేశ్వరం పరిధిలోని పుష్కపల్లి (కొల్లూరు 2) క్వారీలో ఇసుక లోడింగ్

వరంగల్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో అడ్డగోలుగా ఇసుక దోపిడీ కొనసాగుతున్నది. అధికార పార్టీ నేతల అండదండలతో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌ఎండీసీ) సహకారంతో కాంట్రాక్టర్లు మరింత రెచ్చిపోతున్నారు. అక్రమ వసూళ్లకు తెరలేపి సహజ సంపదను దోచుకొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక ఇసుక దోపిడీ స్పీడ్ అందుకొన్నది. గత కేసీఆర్ సర్కారు మాత్రం ఇసుక ధరలు అందరికీ అందుబాటులో తేవాలనే లక్ష్యంగా పెట్టుకొని, ఇసుక క్వారీలు నిర్వహించాలని నిర్ణయించి, ఆ మేరకు పాలసీని రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయంతోపాటు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఈ పాలసీ తీసుకొచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ పరిధిలోని ఇసుక క్వారీలు అక్రమాలకు నిలయంగా మారాయి. అధిక ధరలకు ఇసుకను విక్రయించి వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. టీఎస్‌ఎండీసీ పేరిట లారీల యజమానులు చెల్లించిన మొత్తం కంటే ఐదారు టన్నులు అధికంగా లారీల్లో ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. గోదావరి నదిలోని ఇసుక క్వారీల్లో అక్రమంగా ఇసుకను దోపిడీ చేస్తున్నారు. ఒక్కో లారీ నుంచి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. తొమ్మిది క్వారీల నుంచి ప్రతిరోజూ 700 లారీల్లో వరంగల్, హైదరాబాద్ మహానగరాలకు 17,100 టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నది. రోజుకు ఒక్కో లారీకి రూ.5 వేల చొప్పున దాదాపు రూ.30 లక్షల చొప్పున దోపిడీ జరుగుతున్నది. అధికార పార్టీ నేతల అండదండలతో కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి ఈ దందా సాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి ఈ దందా జోరందుకున్నది. క్వారీల వద్ద దోపిడీ, అక్రమాలపై టీఎస్‌ఎండీసీ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని లారీ యజమానులు వాపోతున్నారు.

### గోదావరి సాక్షిగా...

గోదావరి నదిలో తవ్విన ఇసుకను అక్కడి నుంచి రవాణాకు అనుగుణంగా ఉండే ప్రాంతానికి తరలించి అక్కడ స్టాక్ యార్డును ఏర్పాటు చేస్తారు. ఇలా ఇసుకను తవ్వి స్టాకు యార్డు వరకు రవాణా చేసేందుకు టీఎస్‌ఎండీసీ కాంట్రాక్టర్లను నియమిస్తుంది. టీఎస్‌ఎండీసీ క్యూబిక్ మీటరు చొప్పున కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తుంది. నదిలో ఇసుక తవ్వకం, రవాణా మాత్రమే కాంట్రాకర్ల పనులుగా ఉంటాయి. అధికార పార్టీ ముఖ్యనేతలు, వారి అనుచరులే కాంట్రాకర్లుగా ఉండటంతో ఇక్కడి వ్యవహారాలన్నీ వారి పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి గోదావరి ఇసుకతో కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. టీఎస్‌ఎండీసీ పేరుతో ఆన్‌లైన్ సాండ్ ఆర్డర్ రిసిప్టును చూపించిన వారికి అందులో పేర్కొన్న ప్రకారం క్వారీల వద్ద లారీల్లో ఇసుకను ఉచితంగా లోడింగ్ చేయాలి. ఈ లోడింగ్ కోసం క్వారీల్లో అదనంగా రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. క్వారీల వద్ద కాంటా వేసినందుకు ఒక్కో లారీ నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. ఇసుక గాలికి చెదరకుండా లోడ్‌పైన టార్పాలిన్, ప్లాస్టిక్ కవర్ కట్టేందుకు క్వారీల వద్ద ఒక్కో లారీకి వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. మొత్తంగా ఇసుక డంపింగ్ యార్డుకు వెళ్లిన లారీ లోడింగ్‌తో బయటికి వచ్చే ఒక్కో లారీకి రూ.5 వేలు బలవంతంగా వసూలు చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం, మహదేవపూర్ పరిధిలో గోదావరి నదిలో ఉన్న ఇసుక రీచ్‌లు కాంట్రాక్టర్లకు, టీఎస్‌ఎండీసీ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కాళేశ్వరం పరిధిలో మద్దులపల్లి (పలుగుల 7), అన్నారం కామన్ క్వారీ, అన్నారం బరాజ్ అప్‌స్ట్రీమ్ క్వారీ, పుస్కుపల్లి(కొల్లూరు 2, పలుగుల 5, పలుగుల 8, పలుగుల 11, పుస్కుపల్లి (పలుగుల 6).. మహదేవపూర్ పరిధిలోని పెద్దంపేట క్వారీల నుంచి ప్రతి రోజూ 700 లారీల్లో వరంగల్, హైదరాబాద్ నగరాలకు 17,100 టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నది.

### అంతా అక్రమాలే...

టీఎస్‌ఎండీసీ క్వారీలు, యార్డుల వద్ద లారీలలో లోడింగ్ చేసే ధరను రాష్ట్ర ప్రభుత్వం టన్నుకు రూ.375గా నిర్ణయించింది. సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, సర్వీసు చార్జీ, రోడ్డు డ్యామేజీ చార్జీలు కలిపి టన్నుల ప్రకారం డీడీ మొత్తం ఉంటుంది. లారీల పరిమాణం ప్రకారం 16.38 టన్నులు, 21.06 టన్నులు, 26.52 టన్నుల లోడింగ్‌కు అవకాశం ఉంటుంది. టీఎస్‌ఎండీసీ ఆధ్వర్యంలో సాండ్ సేల్స్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఇసుక అవసరమైన వారు(లారీ ఓనర్లు) ఆన్‌లైన్‌లో డబ్బులను చెల్లిస్తారు. అయినా, లారీలు క్వారీలకు వస్తున్నప్పుడే అక్కడ సిబ్బంది లారీ డ్రైవర్ల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు. రూ.2 వేలు ఇచ్చిన వారికి ఒక బకెట్, రూ.4 వేలు ఇచ్చిన వారికి రెండు బకెట్ల చొప్పున లారీల్లో అదనంగా ఇసుకను లోడ్ చేస్తున్నారు. ఒక బకెట్‌కు సుమారుగా ఐదారు టన్నులు అదనంగా ఎక్కువ ఇసుక లోడ్ అవుతున్నది.

## అక్రమంగా ఇసుక డంప్‌లు!

మద్దూర్ (కొత్తపల్లి), జూన్ 21 : కొత్తపల్లి మండలం నందిగామకు చెందిన ఓ పోలీస్ అధికారి ఇంటి నిర్మాణం కోసం శివారులోని వాగు నుంచి రెండ్రోజులుగా ఇసుక తరలిస్తున్నాడు. రాత్రి వేళ గుట్టుగా రవాణా చేస్తూ తన పొలంలో సుమారు 70 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేయించాడు. విషయం అధికారులకు తెలిసినా అతనికే అండగా నిలిచినట్టు తెలుస్తున్నది. ఉద్యోగులు సైతం చేసేది లేక ఆన్‌లైన్ పేరుతో అందిస్తున్నామని చెప్పి అప్పటికప్పుడు 20 ట్రాక్టర్ల ఇసుకను బుక్ చేసుకున్న వారికి శుక్రవారం సరఫరా చేశారు. మిగితా ఇసుక ఆనలైన్‌లో బుక్ చేసుకున్న వారికే చేరుతుందా? లేక రహస్యంగా సదరు అధికారికి అప్పగిస్తారా? అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నది. తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా స్థానికుల సమాచారంతో నందిగామ శివారులోని 60 ట్రాక్టర్ల ఇసుక డంప్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## తుంగభద్ర నదిలో ఇసుక వివాదం

రాజోళి, జూన్ 21 : తుంగభద్ర నది నుంచి ఇసుక తరలిస్తున్న జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఇసుక ట్రాక్టర్ల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన అనుమతుల ఆధారంగా తూర్పు గార్లపాడు శివారులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా అనుమతి పొందిన వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. శుక్రవారం ఏపీ పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు రాజోళి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శాంతినగర్ సీఐ సిబ్బందితో చేరుకున్నారు. గద్వాల జిల్లా అధికారులు ఏపీ ఆఫీసర్లతో మాట్లాడి సమస్యను కొలిక్కి తీసుకొచ్చారు. దీంతో నదిలో ఇసుక కోసం వచ్చిన 64 ట్రాక్టర్లకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు సమాచారం.

## టీచర్ల వెబ్ ఆప్షన్లు గాయబ్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): టీచర్ల పదోన్నతులు, బదిలీల్లో తప్పుల మీద తప్పులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా టీచర్లు ఎంచుకున్న వెబ్ ఆప్షన్లు గాయబ్ అయ్యాయి. ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు చేపడుతుండడంతో టీచర్లంతా వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారు. ఇక బదిలీల ఉత్తర్వులొస్తాయని వేచి చూస్తుండగా 'మీ వెబ్ ఆప్షన్లు డిలీట్ అయ్యాయి తక్షణమే.. మళ్లీ వెబ్ ఆప్షన్లు ఎంచుకోండి' అని హైదరాబాద్ డీఈవో నుంచి టీచర్లకు సమాచారం అందింది. దీంతో టీచర్లంతా మళ్లీ వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాల్సి ఉంది. మరికొన్ని జిల్లాల్లోను ఇదే తరహాలో వెబ్ ఆప్షన్లు డిలీట్ కాగా, మళ్లీ ఎంచుకోవాలని ఆయా టీచర్లకు సమాచారామిచ్చినట్టు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. ఆన్‌లైన్ అంటే సులభతరం కావాలి.. కానీ ఇలా తలనొప్పులేంటని టీచర్లు వాపోతున్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నట్టా..? లేనట్టా?

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): సర్కారు జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ల కొరత సమస్య వేధిస్తుంది. కాలేజీల్లో అధ్యాపకులు లేకపోవడంతో తరగతులు సవ్యంగా సాగడంలేదు. గతంలో ఉన్న అతిథి అధ్యాపకులను కొనసాగించడంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 1 నుంచి క్లాసులు ప్రారంభమైన సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. 422 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,724 మంది లెక్చరర్, 334 వొకేషనల్ లెక్చరర్ పోస్టుల చొప్పున 2,070 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరి స్థానంలో ఏటా 1,654మంది గెస్ట్ ఫ్యాకల్టీని తీసుకుంటున్నారు. అయితే ఈ ఏడాది గెస్ట్ ఫ్యాకల్టీ కొనసాగింపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నట్టా..? లేనట్టా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఇటీవల మంజూరైన 20కి పైగా కాలేజీల్లో ఫ్యాకల్టీ కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపించగా, వాటిని కూడా పెండింగ్‌లో పెట్టారు.

## గెజిటెడ్ ఆఫీసర్స్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్‌లో గెజిటెడ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫలితాలు శుక్రవారం టీజీపీఎస్సీ విడుదల చేసింది. అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఉద్యోగాల నోటిఫికేషన్ 2022లో విడుదలైంది.

## జూలై 6 నుంచి 15 వరకు సీపీగెట్ పరీక్షలు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్) రాత పరీక్షలను జూలై 6 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్టు కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, వంటి 45 సబ్జెక్టుల్లో యూనివర్సిటీల్లో ప్రవేశాలకు పరీక్షను నిర్వహిస్తామని వెల్లడించారు. రోజుకు మూడు సెషన్లలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూలై 3 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.osmania.ac.in, https://cpget.tsche.ac.in, www.ouadmissions.com వెబ్‌సైట్లను సంప్రదించాలని కోరారు.

## 28 నుంచి 'టౌన్ ప్లానింగ్' వెరిఫికేషన్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్స్ ఓవర్‌సీర్ పోస్టుల భర్తీకి ఈ నెల 28 నుంచి జూలై 2 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. 26 నుంచి ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. వివరాలకు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## సిరిసిల్లలో మరో నేతకార్మికుడి ఆత్మహత్య

**ఆరు నెలలుగా పనులు లేక బలవన్మరణం**

నాగరాజు (ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 21 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో నేతకార్మికులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడంతో ఇప్పటికే ఆరుగురు నేతకార్మకులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తాజాగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లో కుడిక్యాల నాగరాజు(47) బలన్మరణానికి పాల్పడ్డాడు. నాగరాజుకు భార్య లావణ్య, కొడుకులు లోకేశ్, విఘ్నేష్ ఉన్నారు. నాగరాజు మరమగ్గాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య లావణ్య బీడీలు, మిషన్ కుడుతూ చేదోడుగా ఉంటున్నది. ఆరు నెలలుగా వస్త్ర పరిశ్రమలో పనులు లేక నాగరాజు ఖాళీగా ఉంటున్నాడు. గతంలో ఆయన అనారోగ్యం పాలవ్వగా, రూ.4 లక్షల వరకు వైద్యానికి, ఇతర ఖర్చులకు అప్పు చేశాడు. పెద్ద కొడుకు లోకేశ్ ఇటీవలే పదో తరగతి పాసవగా, ఇంటర్ చదివించాలనుకున్నాడు. కొడుకు పుస్తకాల కోసం సెల్ ఫోన్ అమ్మేశాడు. ఆరు నెలలుగా పనులు లేకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా మారడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో నన్న బెంగతో రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన నాగరాజు, రాత్రి ఇంటికి చేరాడు. తీవ్ర మనస్తాపం చెందిన నాగరాజు శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో భార్య బయటకు వెళ్లగా బాత్‌రూంలో వాడే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యు లు సిరిసిల్ల దవాఖానకు తరలించారు. రాత్రి వేళలో పరిస్థితి మిషమించి మృతి చెందాడు. వరుసగా నేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నా కాంగ్రెస్ సర్కార్ మాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## కరెంటు షాక్‌తో టిప్పర్ డ్రైవర్ మృతి

పెద్దఅంబర్‌పేట, జూన్ 21: టిప్పర్‌కు కరెంటు తీగలు తగలడంతో షాక్‌కు గురై డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. బీహార్‌కు చెందిన ధీరజ్‌కుమార్ (19) పెద్దఅంబర్‌పేటలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భారీ రాళ్ల లోడ్‌తో ఉన్న టిప్పర్‌ను ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో కొహెడ పరిధిలోని మైత్రి విల్లాస్ వెంచర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ రాళ్లను దింపే క్రమంలో టిప్పర్ వెనుక భాగం పైకి లేవగానే కరెంటు తీగలు తగిలాయి. లారీకి విద్యుత్తు సరఫరా కావడంతో ధీరజ్‌కుమార్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

## 24 నుంచి 'మాడల్' టీచర్ల ఆందోళన

హైదరాబాద్, జూన్ 21(నమస్తే తెలంగాణ): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాడల్ స్కూళ్ల టీచర్లు ఈనెల 24నుంచి 29వరకు దశల వారీగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. 29న పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు యాకమల్లు, నగేశ్ తెలిపారు.

వరంగల్ ఎంజీఎం దవాఖాన ఆవరణలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలుపుతున్న జూడాలు

## 24లోగా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

- సకాలంలో స్టైపెండ్ చెల్లించాలి: జూనియర్ డాక్టర్ల డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా నల్ల దుస్తులతో నిరసన

హైదరాబాద్ సిటీబ్యూరో, బన్సీలాల్‌పేట్/కాశీబుగ్గ/ఎదులాపురం, జూన్ 21: జూనియర్ డాక్టర్ల సమస్యలను పరిరక్షించాలని, సకాలంలో స్టైపెండ్ చెల్లించి, దవాఖానల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి వినతి పత్రం అందించినా స్పందించడంలేదని వాపోయారు. ఈ నెల 24లోగా ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. గ్రేటర్ పరిధిలోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే, ఎర్రగడ్డ ఛాతి దవాఖాన, మానసిక రోగుల దవాఖాన, వరంగల్ ఎంజీఎం దవాఖాన, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో జూడాలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి జూడాలకు ఇచ్చే స్టైఫండ్‌ను ప్రతి నెల సకాలంలో విడుదల చేయాలని, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గౌరవ వేతనం చెల్లించాలని, తెలంగాణాలో ఏపీ విద్యార్థులకు ఇస్తున్న 15 శాతం రిజర్వేషన్ తొలగించాలని, హాస్టల్, భద్రత సదుపాయం కల్పించాలని, ఉస్మానియా దవాఖానకు నూతన భవనం నిర్మించాలని, కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్లు వేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఇదివరకే రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చి మూడు రోజులైందని తెలిపారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ దవాఖానలో జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హర్ష, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ, ప్రధాన కార్యదర్శి లౌక్య నిరసనలో పాల్గొన్నారు.

## లక్ష లంచం తీసుకుంటూ దొరికిన సూరారం సీఐ

దుండిగల్, జూన్ 21: భూతగాద విషయంలో బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా సూరారం సీఐ ఆకుల వెంకటేశంను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా శుక్రవారం సాయంత్రం ఏసీబీకి చిక్కాడు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో ఓ భూవివాదం కేసులో రత్నాకరం సాయిరాజ్ అనే వ్యక్తిపై గతంలో కేసు నమోదైంది. అతడిపై రౌడీషీట్ ఓపెన్ చేయకుండా ఉండాలంటే మూడు లక్షలు ఇవ్వాలని సీఐ వెంకటేశం డిమాండ్ చేశాడు. ఈ మేరకు రెండు లక్షలకు ఒప్పందం కుదరడంతో ఆ మొత్తాన్ని సీఐకి అందజేశాడు. ఆ తర్వాత అదే స్థలాన్ని డెవలప్‌మెంట్ చేసుకుంటానని సీఐని ఇటీవల సంప్రదించగా మరో ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ. లక్షకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వెంటనే బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం సాయంత్రం ముందస్తుగా రూ. లక్ష ఇచ్చేందుకు సీఐకి చెప్పాడు. ఆ మేరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐకి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వెంకటేశంను అదుపులోకి తీసుకొని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

జడ్పీ మీటింగ్‌లో కరెంట్ పోవడంతో చీకట్లోనే మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

## జడ్పీ మీటింగ్‌కూ తప్పని కరెంట్ ఇక్కట్లు

కంఠేశ్వర్, జూన్ 21: నిజామాబాద్ జిల్లా పరిషత్ పాలకవర్గ చివరి సమావేశానికీ కరెంట్ ఇక్కట్లు తప్పలేదు. మీటింగ్ జరుగుతున్న సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్ సహాయంతో కొనసాగించాల్సి వచ్చింది. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలోనూ పలుమార్లు కరెంట్ పోవడంతో చీకట్లోనే మీటింగ్‌ను కొనసాగించిన సంగతి తెలిసిందే. ఇది మరువక ముందే శుక్రవారం జడ్పీ చైర్మన్ విఠల్‌రావు అధ్యక్షతన నిర్వహించిన జడ్పీ సమావేశానికి కరెంట్ కష్టాలు వెంటాడాయి. కరెంట్ లేకపోవడంతో జనరేటర్ సహాయంతో సమావేశాన్ని కొనసాగించారు.

## ఎంజీఎంలో విద్యుత్తు అంతరాయం

కాశీబుగ్గ, జూన్ 21: వరంగల్ ఎంజీఎం దవాఖానలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో జనరల్ ఓపీ, క్యాజువాలిటీ వార్డుకు వచ్చే రోగుల ఎక్స్‌రే, స్కానింగ్, రక్త పరీక్షలు ఆలస్యమయ్యాయి. దీంతో రోగులు బారులు తీరాల్సి వచ్చింది. మధ్య మధ్యలో చాలాసార్లు విద్యుత్ అంతరాయం జరగడంతో పలు సేవలు నిలిచిపోయినట్టు సిబ్బంది పేర్కొన్నారు. మొత్తానికి దవాఖానకు వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు, ఇతర రిపోర్టులు అందక నిరాశతో మరుసటి రోజు వస్తామని వెళ్లిపోయారు

ఎక్స్‌రే కోసం వేచి చూస్తున్న రోగులు

## వేతనాల కోసం స్టాఫ్ నర్సుల నిరసన

మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్ దవాఖాన ఓపీ ఎదుట స్టాఫ్ నర్సులు ఆందోళనకు దిగారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. – ఎదులాపురం

## 'డబుల్' ఇండ్ల కోసం రోడ్డెక్కిన నిరుపేదలు

తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ పలువురు శుక్రవారం రామాయంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఉదయమే ఇండ్లు లేని వారు పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ లేకపోవడంతో అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. అక్కడ ఎవరూ స్పందించకపోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించారు. తమకు ఇండ్లు ఇవ్వాలంటూ గంటన్నరకుపైగా రాస్తారోకో చేశారు.

– రామాయంపేట

## భూనిర్వాసితుడి నుంచి 70 వేలు లంచం

న్యాల్‌కల్ జూన్ 21: ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌కు చెందిన రైతు హెచ్ మల్లప్ప నిమ్జ్ భూసేకరణలో 2.36 ఎకరాల అసైన్డ్ భూమిని కోల్పోయాడు. తాను నివేదిక ఇస్తేనే పరిహారం చెక్కు వస్తుందని, రూ. లక్ష ఇవ్వాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గయ్య రైతు మల్లప్పను డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. శుక్రవారం మల్లప్ప ఆర్ఐకి ఫోన్‌చేయగా, గంగ్వార్ చౌరస్తాలోగల కిరాణా షాప్ వద్దకు రమ్మన్నాడు. అక్కడ ఆర్ఐ దుర్గయ్య రైతు నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.